క్లుప్తంగా

వైఎస్సార్ చేయూతకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్: మండలంలో 45 ఏళ్లకు పైబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలు వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, రైస్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్ హిస్టరీ నకలు పత్రాలను స్థానిక సచివాలయంలో సమర్పించాలన్నారు. పాత లబ్ధిదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ, పరిశీలన పత్రం జత చేసి వెల్ఫేర్ సిబ్బందికి అందజేయాలని ఆయన సూచించారు.

సీపీఐ బస్సుయాత్ర

చిత్తూరు కార్పొరేషన్: కేంద్రంలో మోదీ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రను నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు తెలిపారు. విశాఖపట్నం నుంచి తిరుపతి వరకు యాత్ర ఉంటుందన్నారు. చిత్తూరులో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాదం పేరుతో మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి తిరిగి అధికారంలో రావాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ క్రమంలో సీపీఐ మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ నాయకత్వంలో జరగనున్న యాత్రను జయప్రదం చేయాలని వివరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజన్ నాయకులు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో అధ్యాపకులు, నిర్వాహకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం మురకంబట్టు అపోలో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీలో గురువారం మొదటి గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అపోలో వర్సిటీ వీసీ వినోద్ భట్, అపోలో నాలెడ్జ్ కార్యనిర్వహణ అధికారి నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య రంగంలో ఫిజియోథెరపిస్టులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మందులతో నయం చేయలేని ఎన్నో వైకల్యాలను ఫిజియోథెరపీతో సరిచేయవచ్చునన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చురుగ్గా నిర్మాణ పనులు

కార్వేటినగరం: జిల్లాకే తలమానికంగా గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి నిలుపుతున్నారు. నియోజకవర్గంలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం మోల్డింగ్ పనులను ప్రారంభించారు. జీడీనెల్లూరు నియోజకవర్గానికి రాష్ట్రంలో గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి పనులకు మంత్రి నారాయణస్వామి శ్రీకారం చుడుతున్నారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 30 ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధి చేసి చూపుతున్నారు. కార్వేటినగరం, పెనుమూరు మండలాల్లో సామాజిక ఆరోగ్యకేంద్రాల నిర్మాణానికి రూ.26 కోట్లు వెచ్చించిన ఘనత డిప్యూటీ సీఎంకే దక్కుతుంది. సీహెచ్‌సీ నిర్మాణ పనులు జరుగుతుండగానే, అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందించడానికి డాక్టర్లు అందుబాటులోకి వచ్చారు.

కామధేనువుపై శ్రీకృష్ణుడు



కామధేనువుపై విహరిస్తున్న శ్రీకృష్ణుడు

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వార్లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టుపీతాంబరాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ద్రౌపదీదేవి జన్మస్థలమైన చౌటూరు గ్రామానికి ఊరేగింపుగా వెళ్లారు. వన్నియ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు అమ్మవారిని భక్తిప్రపత్తులతో పూజించి, సారెను సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం యాదవ సంఘ ఆధ్వర్యంలో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణభగవానుడు కామధేనువుపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్, సభ్యులు ముకుందప్రకాష్, సెల్వరాజ పిళ్లై, మునిరాజ, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, మోహన్ పర్యవేక్షించారు.



అమ్మగారి ఇంటికి పయనమైన ద్రౌపదీదేవి

కన్వీనర్లకు రూ.10 లక్షల బీమా





సమావేశంలో మాట్లాడుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, హాజరైన సచివాలయ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు

- మరోసారి జగనన్నను సీఎం చేద్దాం
- వచ్చే ఎన్నికల్లో కలసికట్టుగా విజయం సాధిద్దాం
- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పిలుపు

తవణంపల్లె: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లకు రూ.10 లక్షల బీమా చేసినట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పిలుపునిచ్చారు. మండలంలోని కాణిపాకం రోడ్డులో ఉన్న నారాయణాద్రి కల్యాణ మండపంలో గురువారం పూతలపట్టు నియోజకవర్గ మండల, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి, మరోసారి జగనన్నను సీఎం చేద్దామన్నారు. పార్టీ కోసం కష్టపడి చేసే నాయకులకు, కార్యకర్తలకు జగనన్న అండగా ఉన్నారని చెప్పారు. అందులో భాగంగానే దేశంలో ఎక్కడాలేని విధంగా బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మండల, సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు సీఎం వైఎస్ జగన్ రూ.10 లక్షలకు బీమా చేయించి ప్రీమియం చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. దీన్ని మండల, సచివాలయ కన్వీనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఎదుర్కొని జగనన్న సైనికులు పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. టీడీపీ నాయకులు పుంగనూరులో చేసిన అల్లర్లు, దౌర్జన్యాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతిఘటించాలని చెప్పారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ తుడుచుకుపెట్టుకుపోవడం ఖాయం అన్నారు. మండల, సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు జీవిత బీమా సౌకర్యం కల్పించడంపై సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం జేసీఎస్ సైన్యం యాప్ గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తవణంపల్లె, ఐరాల, బంగారుపాళ్యం, పూతలపట్టు మండలాల పార్టీ కన్వీనర్లు హరిరెడ్డి, బుజ్జిరెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీకాంత్ రెడ్డితోపాటు అన్ని మండలాల్లోని మండల సచివాలయ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు రాజారత్నం రెడ్డి, శిరీష్ రెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వర రెడ్డి, కిషోర్‌కుమార్ రెడ్డి, రవిరెడ్డి, రంజిత్ రెడ్డి, మధుకుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సేవలు హర్షణీయం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: జర్నలిస్టుల సేవా కార్యక్రమాలు హర్షణీయమని ఎస్పీ రిశాంత్‌రెడ్డి అన్నారు. ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. నగరంలోని గంగనపల్లి నగర నిరాశ్రయుల కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ రిశాంత్‌రెడ్డి, నగర కమిషనర్ అరుణ ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జర్నలిస్టులు సామాన్యుల గొంతును వినిపించాలని సూచించారు. జిల్లాలో జర్నలిస్టుల సమస్యలపై పోలీసు శాఖ నుంచి ఏవైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరిస్తామని తెలిపారు. తన దృష్టికి రాని సమస్యలేవైనా ఉంటే తనను కలిసి తెలియజేయవచ్చన్నారు. సంచలనాలకు కాస్త దూరంగా ఉంటూ వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. నగర కమిషనర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సేవలు గొప్పవన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు లోకనాథన్, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ మాట్లాడుతూ పలు చోట్ల జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. పలు సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో రేణుకకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం గోపి, సపోర్ట్ సంస్థ నిర్వాహకులు జోసెఫ్‌రాజు, ప్రెస్‌క్లబ్ నాయకులు పవన్‌కుమార్, శివ, మురళి, చంద్ర, అయ్యప్ప, సీనియర్ జర్నలిస్టులు రమేష్ బాబు, కాశీశ్వర్‌రెడ్డి, ఇషార్, వీరరాఘవులు నాయుడు, శివప్రసాద్, బాలసుందరం, చంద్ర, మస్తాన్, రాజేష్, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బండి కుంభం



ముట్టుకూరులో బయల్దేరిన బకాసురుని బండి

తవణంపల్లె: మండలంలోని ముట్టుకూరులో ద్రౌపదీసమేత ధర్మరాజుల గుడిలో జరుగుతున్న మహా భారత యజ్ఞంలో భాగంగా గురువారం బకాసురుని బండి కుంభం వైభవంగా నిర్వహించారు. కళాకారుడు సురేష్ భీముడి వేషధారణలో గ్రామాల్లో తిరిగి బకాసురునికి ఆహారం సేకరించారు. గ్రామాల్లో భక్తులు భీమునికి ఆహారం ఇచ్చి పంపారు. రాత్రి తమిళంలో నాటక ప్రదర్శన ప్రారంభమైంది.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది





గుడిపాల: రెడ్డిశేఖర్‌రాజుకు సన్మానం, తవణంపల్లె: ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న సహచరులు

గుడిపాల: ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని చిత్తపార జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళీకుమార్ అన్నారు. చిత్తపార జెడ్పీ హైస్కూల్లో నాలుగేళ్లు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన రెడ్డిశేఖర్‌రాజును గురువారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాలను ఎంతగానో అభివృద్ధి చేసి విద్యార్థుల సంఖ్యను పెంచిన ఘనత రెడ్డిశేఖర్‌రాజుకే దక్కిందన్నారు. ఆయన సేవలు ప్రశంసనీయమని కితాబిచ్చారు. ఉపాధ్యాయులు శరవణ, రేవతి, షకీల్‌అహ్మద్, గాయత్రి, మహేశ్వరి, లోకేశ్వరి, లావణ్య, రాజేశ్వరి ఆయన్ను పూలమాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

తవణంపల్లె: మండలంలోని వెంగంపల్లె జెడ్పీ హెచ్‌ఎస్ నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు గురువారం ఘనంగా వీడ్కోలు పలికి సత్కరించారు. అరగొండ బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లిన హెచ్‌ఎం మోహన్ రెడ్డితోపాటు ఉపాధ్యాయులు విద్యాసాగర్, పట్టాభి, ఉమాపతిని వెంగంపల్లె హెచ్‌ఎం శాంతి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ విజయభాస్కర్ రెడ్డి, సర్పంచ్ రాజేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం



ఉద్యోగులకు ఈఎస్ఐ కార్డులు అందజేస్తున్న మేయర్ అముద, కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. నగర మేయర్ ఎస్.అముద ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అజెండా రూపొందించిన అంశాలపై చర్చించి ఆమోదించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి పిలిచిన టెండర్లను తక్కు మొత్తం కోట్ చేసిన కాంట్రాక్టర్లకు అప్పగించడం, 14 విలీన పంచాయతీల్లో తాగునీటి బోరు మోటర్ల నిర్వహణకు, అత్యవసర మంచినీటి సరఫరా దృష్ట్యా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, అమృత్ పథకం కింద సైతం పిలిచిన టెండర్లకు స్టాండింగ్ కమిటీ ఆమోద ముద్ర వేసింది. సమావేశంలో కమిటీ సభ్యులు కమిషనర్ అరుణ, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, జీఆర్.శ్రీకాంత్, సి.శోభ, బి.పూర్ణచంద్రరావు, సహదేవ పాల్గొన్నారు.

ఈఎస్ఐ కార్డుల పంపిణీ

చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గురువారం (ఈఎస్ఐ)హెల్త్ కార్డులు అందజేశారు. మునిసిపల్ కార్యాలయంలో మేయర్ అముద, కమిషనర్ అరుణ చేతులమీదుగా వీటిని పంపిణీ చేశారు.

బీఎల్వోలు బాధ్యతగా వ్యవహరించాలి

ఎన్నికల విధుల్లో ఉన్న బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ వో)లు బాధ్యతగా విధులు నిర్వహించాలని, ఎన్నికల విధులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ అరుణ స్పష్టం చేశారు. ఓటర్ల రీ వెరిఫికేషన్ కార్యక్రమంపై నగరపాలక కార్యాలయంలో బీఎల్వోలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా రీ–వెరిఫికేషన్ కార్యక్రమం క్షేత్రస్థాయిలో పక్కాగా చేపట్టాలన్నారు. బీఎల్వోలు నేరుగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల జాబితా రీ–వెరిఫికేషన్ చేపట్టాలన్నా రు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి బాధ్యత గా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో సహాయ కమిషనర్ గోవర్ధన్, మునిసిపల్ ఇంజనీరు వెంకట ప్ర సాద్, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణుడు, మెప్మా సీఎంఎం గోపి, యూనియన్ నాయకులు రామ్మూర్తి, ప్రత్యేక అధికారి ప్రభాకర్, ఏఎస్వో సౌందర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి





బంగారుపాళెం: రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి, గుడిపాల: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ హరి

బంగారుపాళెం(ఐరాల): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి సూచించారు. ఆమె గురువారం మండలంలోని తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాన్పులు, మందులు, వ్యాక్సిన్ నిల్వ గదులు, వార్డులను పరిశీలించడంతో పాటు, రికార్డులను తనిఖీ చేశారు. ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్, సిబ్బంది పని తీరుపై వైద్యాధికారి లోహిత్‌చెంగల్రాయన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలో ఓపీతో పాటు, సుఖప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. జెడ్పీ హైస్కూల్‌లో నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చారా అని హెచ్‌ఎంను, వైద్యాధికారిని అడిగారు. దీనిపై వారు స్పందిస్తూ వంద శాతం కార్యక్రమం విజయవంతం చేశామని తెలిపారు. అనంతరం ముంగరమడుగు గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, ఎపిడిమాలజిస్ట్ శ్రీవాణి, డాక్టర్ శిరీష, డీపీఎంఓ రవిప్రసాద్, సీహెచ్‌ఓ షమీమ్, సీనియర్ అసిస్టెంట్ దాము, ఎల్‌టీ శరత్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటి వద్దకు వైద్యసేవలు

గుడిపాల: ప్రతి ఇంటి వద్దకు వైద్యసేవలు అందజేయనున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరి తెలిపారు. తుమ్మిందపాళ్యం గ్రామంలో గురువారం 104 వైద్యసేవలందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోనే ప్రతి ఇంటి వద్దకు వైద్య సేవలను అందజేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకువచ్చిందన్నారు. 60 మందికి బీపీ, షుగర్, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్ర, రాధిక,నందిని, గౌరమ్మ, పద్మావతి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.



నెల్లిమండపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని నెల్లిమండపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత 104 వైద్య శిబిరంలో 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు.కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కట్టమంచి చెరువు పరిశీలన



కట్టమంచి చెరువును శుభ్రం చేస్తున్న సిబ్బంది

చిత్తూరు అర్బన్: కట్టమంచి చెరువులో చేపలు మృతి చెందిన సంఘటనపై సత్వరం చర్యలు తీసుకోవాలని కమిషనర్ జె అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కట్టమంచి చెరువులో చేపలు మృతి చెందాయని విషయం తెలుసుకున్న వెంటనే కమిషనర్ చెరువు వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతి చెందిన చేపలను త్వరగా తొలగించాలని, దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. చేపలు ఎందుకు మృతి చెందాయో విచారించి కారణాలు తెలుసుకుంటామన్నారు. మత్స్య శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఇలాంటి చర్యలు తీసుకోవాలని అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం నిర్వహించిన శిబిరంలో ప్రధానంగా విద్యార్థుల రక్తంలోని హెచ్‌పి శాతాన్ని పరీక్షించారు. హీమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న విద్యార్థులకు ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం అధ్యాపకులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించారు. హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు మంచినీటిని తగినంత తీసుకోవాలని సూచించారు. ఎక్కువగా పండ్లు, కూరగాయలు, పాలు వంటి సంపూర్ణ పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు సత్యనారాయణ, సూపర్‌వైజర్ నూర్జహాన్, ఏఎన్ఎం విష్ణుదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధ్యం

- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- ఘనంగా మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం





సావిత్రమ్మ కళాశాలలో బంగారు పతకాలు పొందిన విద్యార్థినులతో ఎమ్మెల్యే, పార్టీ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధ్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల 41వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపల్ మనోహర్ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ప్రతి సంవత్సరం 10 గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు స్వర్ణపతకాలు అందిస్తున్న ఎన్‌పీ వెంకటేశ్వరచౌదరిని అభినందించారు. కళాశాల అభివృద్ధికి తన వంతు సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. కళాశాల సీపీడీసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి మాట్లాడుతూ 1982లో ప్రారంభమైన సావిత్రమ్మ కళాశాల అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ ప్రస్తుతం నాక్ ఏ గ్రేడ్ సాధించిన తొలి మహిళా కళాశాలగా నిలవడం ఆనందకరమన్నారు. పీవీకేఎన్ ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి, సీపీడీసీ మెంబర్ డాక్టర్.కె.రామలక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. విద్యావంతులైన మహిళలు ఉంటేనే కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం 2021–22లో అత్యధిక మార్కులు సాధించిన 10 మంది విద్యార్థినులకు బంగారు పతకాలు (8 గ్రాములు), ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుతున్న డిగ్రీ విద్యార్థినులు 25 మందికి ఒక్కొక్కరికి రూ.4 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఉషారాణి, తిరుకుమరన్, షమ్స్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్లకు జీవితబీమా

చిత్తూరు కార్పొరేషన్: సచివాలయ కన్వీనర్లకు జీవిత బీమా అందించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం కన్వీనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిత్తూరు నియోజకవర్గంలోని 76 సచివాలయాలు ఉన్నాయని ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు ఉంటారన్నారు. ఆ లెక్కన నియోజకవర్గంలో మొత్తం 228 మందికి రూ.10 లక్షల విలువైన బీమాను అందిస్తున్నట్లు చెప్పారు. మన ప్రభుత్వం వచ్చాక జరిగిన మేలును ప్రతి ఒక లబ్ధిదారుడికి చేరవేసే బాధ్యత కన్వీనర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో నగర సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కోలాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రసాయనాల కంటే కషాయాలే మేలు

పాలసముద్రం : వ్యవసాయంలో రసాయనాల కంటే కషాయాలు ఎంతోమేలని ఏపీపీఎస్ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురంలో పంచాయతీ కార్యదర్శి యశ్వంత్, సర్పంచ్ గాలి మహేష్‌బాబు సమక్షంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతుల ఎదుట ద్రవజీవామృతం తయారు చేశారు. డీపీఎం వాసు మాట్లాడుతూ ద్రవజీవామృతం తయారు చేసేందుకు 2 కిలోల శనగపిండి, 2 కిలోల బెల్లం, 10 కిలోల ఆవు పేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, 20 లీటర్ల నీరు డ్రమ్ములో వేసి కలియబెట్టాలని తెలిపారు. ఈ విధంగా తయారు చేసిన కషాయాన్ని వరి, కూరగాయల పంటలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం అవలంభించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు.



రైతులకు వివరిస్తున్న డీపీఎం వాసు